# సింగిల్ పేజి కథలు

## అర్థం చేసుకోరూ!

హడావిడిగా బ్యాగు సర్దుకుని బయలుదేరుతోంది నమిత. అప్పటికే రాత్రి ఏడు గంటలు అయ్యింది. ఆనంద్ ఆ రోజు సినిమా ప్లాన్ చేసాడు. అసలు ఆరింటికే వెళ్ళాల్సింది కానీ చివరి నిముషంలో మీటింగు పెట్టాడు బాసు. అందువల్ల గంట ఆలస్యమైపోయింది. దొరక్కదొరక్క ఆనంద్‌కి టైమ్ దొరికింది. వెళ్ళకపోతే శ్రీవారు అలుగుతారు.

నమితకి, ఆనంద్‌కి పెళ్ళయి ఆరునెలలు కావొస్తోంది. ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు. మొదట్లో సెలవల్లో బాగానే ఎంజాయ్ చేసినా తరువాత ఒకళ్ళకి తీరిక దొరికితే ఇంకొకళ్ళకి తీరిక దొరకని పరిస్థితి అయ్యింది. ఈ విషయంలో ఆనంద్, నమితలు చాలాసార్లు గొడవపడ్డారు.

ఆటో అతనికి డబ్బులిచ్చి పరుగులాంటి నడకతో ఇల్లు చేరింది నమిత. అప్పటికే రెడీ అయ్యి కునికిపాట్లు పడుతున్న ఆనంద్‌ని చూసి జాలి వేసింది. నమిత రావడంతో ఉలిక్కిపడి లేచాడు ఆనంద్.

“సారీ అండీ! లేటయిపోయింది. అసలు బయలుదేరుతుంటే మధ్యలో..” నమిత చెప్తూ ఉంటే ఆనంద్ మధ్యలోనే కట్ చేసాడు.

“నాకు తెలుసు మేడమ్‌గారు మీరు చాలా బిజీ! నేను పిలిస్తే ఇంకా బిజీ! ఇక్కడ అయిదింటి నుంచి వెర్రి మొహం వేసుకుని వెయిట్ చేస్తున్నాను. ఒక్క కాల్ అన్నా చెయ్యచ్చుగా! ఛీ, ఇంటికన్నా ఆఫీసే నయం. అనవసరంగా ముందు వచ్చాను” అని తన బాధనంతా వెళ్ళగక్కాడు ఆనంద్.

“ఫోన్ చేసేందుకు తీరిక దొరకలేదండీ! మా బాసు అంతసేపు పక్కనే ఉన్నాడు. మా ప్రొడక్ట్‌లో ఏదో కొత్త ప్రొబ్లెం వచ్చింది. అదీ గోల! అర్థం చేసుకోరూ! ప్లీజ్! పోనీ మనం తర్వాత ఆటకి వెళ్దామా?” భర్త పక్కన కూర్చుని అడిగింది నమిత.

“ఎలా వెళ్తాం? వంట ఎప్పుడు చేస్తావు? పని అమ్మాయి కూడా రాలేదు. నాకు అయితే బయట తినడం అస్సలు ఇష్టం లేదు. తరువాత నీ ఇష్టం” బెడ్ రూములోకి వెళ్తూ అన్నాడు ఆనంద్.

నమితకి ఒక్కసారిగా ఉక్రోషం వచ్చింది. ‘ఇప్పుడు తను అంట్లు తోమి, వంట చెయ్యాలి. ఆయన మాత్రం రాజాలా కూర్చుని పేపరు చదువుతారు. అయిదింటి నుంచీ ఇంట్లోనే ఉన్నారు కదా..కొంచెమైనా పని చెయ్యచ్చుగా. ఏ పనిలోనూ సహాయం చెయ్యరు. కనీసం అర్థం కూడా చేసుకోరు’ అనుకుంటూ వంటగదిలోకి వెళ్ళింది నమిత. వంట కానిచ్చి భోజనాలయ్యేసరికి పది గంటలయ్యింది. ఇద్దరు ఎడమొహం పెడమొహం పెట్టుకు పడుకుండిపోయారు.

★ ★ ★

సంక్రాంతికి మూడు రోజులు సెలవలు కలిసి రావడంతో నమిత వాళ్ళ అన్నయ్య ఇంటికి వెళ్ళారు దంపతులు. ఆనంద్‌కి పెద్దగా ఇష్టం లేకపోయినా నమిత ఎలాగో నచ్చచెప్పి విజయవాడ తీసుకెళ్ళింది. చెల్లెలిని, బావని రిసీవ్ చేసుకున్నారు రవి, రమణి. చెల్లి, బావ అంత ఆనందంగా లేరని మొదటి కొద్ది నిముషాల్లోనే అర్థమైంది రవికి. అతనికి చెల్లి అంటే ప్రాణం. అందుకే చెల్లెలి సమస్యని అర్థం చేసుకొని ఏదో ఒకటి చెయ్యాలి అని నిశ్చయించుకున్నాడు.



శనివారం అంతా కృష్ణాబ్యారేజి, గాంధీ పార్కు అవి తిరిగారు నలుగురు. సాయంత్రం ఆడవాళ్ళు వంట పని తొందరగా ముగించారు. రాత్రి వెన్నెల్లో కబుర్లు చెప్పుకుంటూ భోజనం కానిచ్చారు. నమిత, ఆనంద్‌లు కొంచెం బెట్టు వదిలి సంతోషంగా కబుర్లు చెప్పుకున్నారు. మర్నాడు ఆదివారం కనకదుర్గమ్మ గుడికి వెళ్ళాలని నలుగురు ప్లాన్ చేసారు.

ఆదివారం పొద్దున్న లేచేసరికి ఆనంద్‌కి రవి కాఫీ పెడుతూ కనిపించాడు.

“ఏంటి బావా! నువ్వు కాఫీ పెడుతున్నావే?” అడిగాడు ఆనంద్.

“రమణికి ఆఫీసులో ఏదో అర్జంట్ పని ఉందిట బాగా! ఇప్పుడే రమ్మని ఫోన్ వచ్చింది. తను తయారవుతోంది. అందుకే నేను ఈ లోపు వంట మొదలుపెట్టా. పాపం తను ఏదన్నా తిని వెళ్ళాలి కదా!” గబగబా వంట మొదలుపెడుతూ అన్నాడు రవి.

వంట చేయడం ఇష్టం లేకపోయినా బావగారిని వదిలేసి వెళ్ళడానికి మొహమాటపడి ఆనంద్ అక్కడే ఉండి అవీ ఇవీ అందిస్తున్నాడు. ఇంతలో రమణి అక్కడికి వచ్చింది.

“అయ్యో! మీరు ఎందుకు చేస్తున్నారండీ పని! సెలవు పూట కొంచెం ఎక్కువ సేపు పడుకోవాల్సింది. నేను ఎలాగో ఆఫీసుకెళ్ళాలి కదా, మీకు ఎందుకు శ్రమ” రవి చేతిలో పని లాక్కుంటూ అంది రమణి.

“ఏంటి మేడమ్! మేము వంట చెయ్యలేమని మీ భావమా? అసలు నలుడు మన బ్రదరే కదా! ఏమంటావు బావా?” గరిటెని అన్ని రకాలుగా తిప్పుతూ అంటున్న రవిని చూస్తే నవ్వాగలేదు ఆనంద్‌కి.

“ఇదిగో డార్లింగ్! ఉప్మా రెడీ” ప్లేట్‌లో అందించిన భర్త వైపు మురిపెంగా చూసింది రమణి.

“ఏమండోయ్ శ్రీవారు ఉప్మా అదిరింది. నాకు కూడా కొన్ని టిప్స్ చెప్పరూ” అడిగింది రమణి.

ఉప్మా అంత బాగుందా అని రుచి చూశాడు ఆనంద్. అరే, అస్సలు బాలేదు! ఉప్పు ఎక్కువా, ఉప్మా తక్కువ అన్నట్టు ఉంది. అయినా రమణి అంతలా మెచ్చుకుందేంటి అని ఆశ్చర్యపడ్డాడు.

రమణి వెళ్ళిపోవటంతో కనకదుర్గమ్మ గుడి ప్రోగ్రామ్ అంతా క్యాన్సిల్ అయిపోయింది. రవి పాత సినిమా మాయాబజార్ డివిడి తెచ్చాడు. ఇంట్లోనే అంతా సరదాగా గడిపేశారు. గుడి ప్రోగ్రామ్ క్యాన్సిల్ అయిపోయినా రవి మామూలుగా ఉండటం ఆనంద్‌కి ఆశ్చర్యం కలిగించింది. ఇంక ఉండబట్టలేక అడిగేశాడు.

“ఏంటి బావా! ఇలా అయ్యింది. గుడికి వెళ్దామని వేసుకున్న ప్లాన్ అంతా ఫ్లాప్ అయింది. రమణి అంత అర్జంట్‌గా ఆఫీసుకి వెళ్ళాలా?”

ఆ ప్రశ్నకోసమే ఎదురు చూస్తున్న రవి వెంటనే బదులిచ్చాడు.

“రమణి వాళ్ళ కంపెనీ సి.ఇ.ఒ. ఇండియా వచ్చాడట.

ఇవ్వాళ పొద్దున్నే. దాంతో ఆఫీసుకి వెళ్ళాల్సి వచ్చింది. అయినా మనకి తెలుసుగా ఆఫీసుల్లో పనులు ఎలా ఉంటాయో! నాకు ఎన్నోసార్లు పని పడి సెలవురోజుల్లో కూడా వెళ్ళాను. భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగాలు చేస్తు న్నప్పుడు చిన్న చిన్న ఇబ్బందులు తప్పవు! పెళ్ళి కాక ముందు అమ్మ చేసినట్టే భార్య కూడా చెయ్యాలంటే ఎలా కుదురుతుంది? ఆఫీసులో మనతో సమానమైన పని చేస్తూ, ఇంట్లో మనకి రెట్టింపు పని చేస్తారు ఈ ఆడ వాళ్ళు! సహాయం చేసినా చెయ్యకపోయినా కనీసం అర్థం చేసుకొనే స్వభావం మన మగవాళ్ళకి లేకపోతే ఇంట్లో ఆనందం కరువైపోతుంది. నీకు తెలీదని కాదు! ఏదో నా మనసులో మాట చెప్తున్నా" అన్నాడు రవి.

పెళ్ళయ్యాక మొదటిసారి తన తప్పు తెలుసుకు న్నాడు ఆనంద్. ఇన్నాళ్ళూ ఇంట్లో పూచికపుల్లయినా పక్కన పెట్టలేదు తను. పాపం నమిత అంత పనీ తనే చేస్తోంది. దానికి తోడు తన సణుగుళ్ళు భరిస్తోంది. నమి తను అర్థం చేసుకోకుండా తనని కష్టపెట్టానని బాధప డ్డాడు ఆనంద్.

ఆలోచనల్లో పడిన ఆనంద్‌ని చూసి తన లక్ష్యం నెర వేరినందుకు సంతోషించాడు రవి. బావలో కలిగిన మార్పు కలకాలం ఉండాలని, వాళ్ళ కాపురం ఆనం దంగా సాగిపోవాలని మనసులోనే దేవుడికి దండం పెట్టు కున్నాడు.

**-సిరి** (హైదరాబాద్)

# రేపటి మహిళ



రాజారావు బ్రతికున్నంత వరకు రుక్మిణికి పనుల మీద వీధిలోకి వెళ్ళే అవసరం కలుగ లేదు. భర్త కేన్సర్‌తో మరణించడం వల్ల కుటుంబ భారం రుక్మిణి నెత్తిన పడింది.

అత్తని తోడు తీసుకుని భర్త పనిచేసిన ఆఫీసుకి వెళ్ళింది. అంతా సానుభూతి చూపించారు. రుక్మిణి తొమ్మిదో తరగతి చదువుతూ పెళ్ళవడంతో చదువు మానే సింది. క్వాలిఫికేషన్ ఏదీ లేదు గనుక ఆఫీసులో అటెండర్ పోస్ట్ ఇస్తారని చెప్పారు. రుక్మిణి తనకు అటెండర్‌గా అపా యింట్‌మెంట్ ఇవ్వమని అప్లికేషన్ పెట్టి ఆఫీసర్‌కి ఇచ్చి నమస్కారం చేసి వచ్చింది.

రాజారావు జబ్బునపడి ఎక్కువరోజులు సెలవులో వుండడంతో ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టాయి. జాగ్ర త్తగా డబ్బు ఖర్చుపెట్టుకుంటూ ముసలి అత్త, ఇద్దరి పిల్లలతో కాలక్షేపం చేస్తూ వుద్యోగం కోసం ఎదురు చూస్తూ వుంది రుక్మిణి.

ఒక రోజు ఆఫీసు నుంచి ఆమె పేరున కవరు వచ్చింది. ఆఫీసులో వున్న అటెండర్ పోస్టు వికలాంగు లకు రిజర్వేషన్ చేయబడినది అని అందులోని సారాంశం.

అదే వీధిలో వుండే సీతారామయ్య వేరే ఆఫీసులో సీనియర్ అసిస్టెంట్. ఆయనకు ఆఫీసు నుంచి వచ్చిన లెటర్ చూపించింది రుక్మిణి.

"ఆఫీసు వాళ్ళు రాసింది తప్పు. అటెండర్ల వుద్యోగా లలో వికలాంగులకు రిజర్వేషన్ వుండదు. మరి వాళ్ళు తెలిసి రాశారో, తెలియక రాశారో నేను జవాబు రాసిస్తాను. రేపు ఆఫీసుకి వెళ్ళి ఇవ్వు. ఏమంటారో చూద్దాం?" అన్నాడు సీతారామయ్య.

"సార్! నాకు ఉద్యోగం రాకపోతే చాలా కష్టం. ఇవ్వక పోతే ఏం చేయాలి?"

"నీకు ఏదోక వుద్యోగం ఇవ్వాలి. ఈ వూళ్లో కాకపోతే జిల్లా కలెక్టర్‌కు రాస్తే ఏ వూళ్ళో ఖాళీ వుంటే ఆ వూళ్లో ఇస్తారు. ఉద్యోగం రాదని భయపడకు"

"ఒంటరిదాన్ని సార్! ఈ వూళ్ళో పదేళ్ళ నుంచి వుంటున్నాను. అంతా తెలిసిన వాళ్ళు. పరాయి వూరికెళ్ళి బతకలేను" అని కన్నీళ్ళు పెట్టుకుంది రుక్మిణి.

సీతారామయ్య నిట్టూర్చారు.

మర్నాడు సీతారామయ్య రాసిచ్చిన అప్లికేషన్ తీసు కెళ్ళి ఆఫీసర్ చేతికి ఇచ్చింది. అది చదివిన ఆఫీసర్ ముఖం కోపంతో ఎర్రబడింది. గుడ్లురిమి చూసి అప్లికే షన్ విసిరి ఆమె ముఖం మీదకు కొట్టాడు.

"ఐతే మాకు రూల్స్ తెలియవన్నమాట!" అన్నాడు.

ఆమెకు దుఃఖం ముంచుకొచ్చి ఆఫీసర్ చాంబర్ నుంచి బైటకువచ్చి ఏడుస్తోంది.

"ఏమైందమ్మా ఏడుస్తున్నావు?" అటెండర్ శివయ్య అడిగాడు.

రుక్మిణి జరిగినదంతా చెప్పింది.

"గుమాస్తాలు ఏది రాస్తే అయ్యగారు అదే కరక్టు అనుకుంటారు. ఒకసారి సూపరెంటుని కలువు" అన్నాడు శివయ్య.

"బాబాయ్! నువ్వొకసారి సూపరెంటుతో మాట్లాడు నా తరపున" అన్నది రుక్మిణి.

"సరే" అని శివయ్య రుక్మిణిని తీసుకెళ్ళి సూపరెం టుని కలిశాడు. కాసేపు ఏదో మాట్లాడాడు.

"సూపరెంటు ఏమన్నాడు బాబాయ్?" ఆతృతగా అడిగింది రుక్మిణి.

"ముసుగులో గుద్దులాట ఎందుకమ్మా! అసలు సంగతి చెప్పనా?" అన్నాడు శివయ్య.

"చెప్పు బాబాయ్!"

"డబ్బులిస్తే నీకు వుద్యోగం ఇస్తారు"

రుక్మిణి గుండెలో రాయి పడింది.

"డబ్బు ఇవ్వాలా?"

శివయ్య తల వూపాడు.

భర్త చనిపోతే భార్యకు వుద్యోగం ఇవ్వడానికి డబ్బు ఇవ్వాలా? కుటుంబం చితికిపోకుండా సహాయం చేయడం కోసం ప్రభుత్వం పుత్తర్వులు ఇస్తే దానికి కూడా లంచం ఇవ్వాలా? శవాలపై డబ్బు ఏరుకోవడం అంటే ఇదేనేమో?

"బాబాయ్! నా దగ్గర డబ్బు లేదు. పైగా ఆయన జబ్బు కోసం చేసిన అప్పులు న్నాయ్" ఏడుస్తూ అన్నది రుక్మిణి.

శివయ్య ఓదార్చాడు.

కొన్ని రోజుల తర్వాత ఆఫీసు నుంచి ఆమెకు ఒక లెటర్ వచ్చింది.

"ఆఫీసులో నీ క్వాలిఫికేషన్‌కి ఇవ్వద గిన వుద్యోగాలు ఏమీ లేవు. లైట్ వెహికల్ డ్రైవర్ వుద్యోగం మాత్రమే ప్రస్తుతం ఖాళీ వుంది" అని దాని సారాంశం.

రుక్మిణి వెక్కి వెక్కి ఏడ్చింది. నిస్స హాయ స్థితిలో కోపం ముంచుకొచ్చి సర్కారీ లెటర్ చించి ముక్కలు చేసింది.

రెండు నెలల తర్వాత రుక్మిణి ఆఫీసుకి వెళ్ళింది. ఆమెను చూసి అంతా నోరెళ్ళబె ట్టారు. శివయ్య ఆమెను గుర్తుపట్టనే లేదు. శుభ్రంగా క్రాఫ్ చేయించుకుని ప్యాంటు, షర్టు తొడుక్కుని బూట్లు చప్పుడు చేసు కుంటూ ఆఫీసర్ చాంబర్‌లోకి వెళ్ళి అప్లికే షన్ ఇచ్చింది.

"అయ్యా! మీ ఆఫీసులో నాకు ఇవ్వద గిన ఏకైక ఖాళీ లైట్ వెహికల్ డ్రైవర్ ఉద్యోగం ఇవ్వండి. నా డ్రైవింగ్ లైసెన్స్ దీనితో జతపరిచాను"

అది చదివి ఆఫీసర్ కళ్ళు పెద్దవి చేసి రుక్మిణిని ఎగా దిగా చూశాడు.

**-వాణిశ్రీ**